# సంక్రాంతి ప్రాముఖ్యము!



ముఖచిత్రం చూడగానే సంక్రాంతి సందర్భములో తారసపడే సన్నివేశములని మీకు అర్థమై ఉంటుంది. సంక్రాంతి పండుగ అనగానే కోడి పందెములు, భోగి మంటలు, బొమ్మల కొలువులు, గాలి పటములు ఎగురవేయడాలు, హరిదాసులు, బుడబుడక్కలవారు, ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దును ఆడించేవారు, దాసరికాలు, చెక్కభజనలు, తోలు బొమ్మలాటలు మొదలైనవన్నీ గుర్తుకు రావడం సహజం. వీటి వెనుక ఎంతో అర్థము, మానసిక వికాసమునకు సంబంధించిన ప్రయోజనము ఉన్నాయి. ఉదాహరణకి చెక్కభజనలు తీసుకుందాం. ఇది రామాయణము, భాగవతము వంటి ఇతిహాసమునకు సంబంధించిన ఇతివృత్తముతో కూర్చిన పాటలను పాడుతూ లయబద్ధముగా అడుగులు వేస్తూ మానసికోల్లాసాన్ని కలిగించే ప్రక్రియ. ఇందులో ఆరుగురు లేదా ఎక్కువ మంది పాల్గొంటారు. వారిలో ఒకరు నాయకుడుకాగా, మిగిలిన వారు నాయకుని అనుసరిస్తారు. ఈ పాటలను వినడము వలన పురాణములకు సంబంధించిన ఎన్నో విషయములు తెలుస్తాయి. అలాగే హరిదాసులు హరి కీర్తనలను పాడుతూ ఆధ్యాత్మికముగా ఎదగడానికి సహకరిస్తారు. వారికి ఇచ్చే పిడికెడు బియ్యము దాతలయొక్క కర్మలను హరించివేయడానికి ఉపయోగపడుతుందని నమ్మకము. ఈ సందర్భములో కుటుంబములోని కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్రు ఇలా పిల్లలు, పెద్దలు అంతా కలసి చక్కని వాతావరణము ఏర్పడుతుంది. ఇది 'కలసి ఉంటే కలదు సుఖము' అని తెలుసుకొనే చక్కని అవకాశము.

వస్త్రదానము, అన్నదానము మొదలైనవి వంశములో పెద్దలను స్మరిస్తూ చేసే సత్కార్యములు - మనకున్నదానిలో నలుగురికీ పంచి ఇవ్వడమనేది నేర్పిస్తుంది. సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి అసలు కారణము 'పంట చేతికి రావడము'. పండిన పంట చేతికి వచ్చేవరకు ఎంతో మంది ప్రత్యక్షముగాను, పరోక్షముగాను సహకరిస్తారు. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటూ ధాన్యమును కుంచములతో కొలిచి ఇవ్వడం ఎంతో తృప్తినిస్తుంది.

పూర్వము సంక్రాంతి పండగను వారము రోజులకు పైనే జరుపుకునేవారు. ఇది అమెరికా జరుపుకునే 'థ్యాంక్స్ గివింగ్ ' వంటి పండుగ. మనకొఱకు ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని త్యాగమొనరించిన వారికి కృతజ్ఞతలు తెలుపుకోవడమే దీని ముఖ్య ఉద్దేశ్యము. ఆ కారణముగానే మనకు వెలుతురు, వేడిమిని ప్రసాదించే సూర్యభగవానునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ పొంగలిని నైవేద్యముగా సమర్పిస్తారు. సంక్రాంతి పండుగను మొదటి రోజు భోగి, రెండవ రోజు సంక్రాంతి (పెద్ద పండుగ), మూడవరోజు కనుమ, నాల్గవరోజు ముక్కనుమ, ఐదవరోజు తీర్థము (పరస) అని ఐదు రోజుల పండగగా జరుపుకుంటారు.

మళ్ళీ ఉగాది సంచికలో కలుద్దాం! **- సుశ్రీ.**